సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



ఆడుదాం ఆంధ్రా థీమ్ సాంగ్‌కు నృత్యం చేస్తున్న క్రీడాకారులు

వేడుక అదుర్స్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'
డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో ముగిసిన క్రీడా సంబరాలు
క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించిన ముఖ్యమంత్రి జగన్
విజేతలకు బహుమతుల ప్రదానం



బాణసంచా, లేజర్ షో వెలుగుల్లో వైఎస్సార్ స్టేడియం

అభివాదం చేస్తున్న సీఎం జగన్



క్రీడాకారులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాగతీరం ఉరకలెత్తింది. క్రీడాలోకం మురిసిపోయింది. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలు నిర్వహించడమే కాకుండా ముగింపు వేడుకలకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరుకావడంతో క్రీడాకారుల ఆనందానికి అవధులు లేవు. క్రీడాకారులకు స్ఫూర్తినింపుతూ ప్రసంగించారు. క్రీడా ఆణిముత్యాలకు మన ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారులు తొలుత క్రికెట్ ఫైనల్ విజేత జట్టు కెప్టెన్, వైస్ కెప్టెన్లను మాత్రమే వేదిక పైకి రావాలని ఆహ్వానించారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. క్రికెట్ టీమ్ మొత్తం వేదికపైకి రావాలంటూ స్వయంగా ఆయనే చేతులు ఊపి పైకి రావాలని చెప్పడంతో.. క్రికెట్ టీమ్ సభ్యులంతా ఉత్సాహంతో స్టేడియంలో పరుగులు పెట్టారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం జీవితాంతం గుర్తుంచుకుంటామని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు.

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్ : ఉల్లాసంగా.. ఉత్సాహంగా..'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన క్రీడా పోటీలు మంగళవారం విశాఖ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ముగిశాయి. మట్టిలో మాణిక్యాలను ఒడిసిపట్టే మహాయజ్ఞం విశాఖ సాగర తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు విశాఖలో ఐదురోజుల పాటు ఉత్సాహంగా గడిపారు. గత ఏడాది డిసెంబర్ 26న విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడల్లో యువతీయువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపుతూ, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రతిష్టాత్మక వేడుకలు ఘనంగా ముగిశాయి.



కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్, చిత్రంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజని, రోజా, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స ఝాన్సీలక్ష్మి

యువతలో స్ఫూర్తినింపిన క్రీడలు

విశాఖలో జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచాయి. చదువే కాదు క్రీడలు సైతం భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయన్న భరోసాను యువతకు కల్పించాయి. వైఎస్సార్ స్టేడియంలో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ఆరోగ్యం వ్యాయామాల పట్ల ప్రజలకు అవగాహన పెరగాలన్నది ఆడుదాం ఆంధ్రా పోటీల మొదటి ఉద్దేశమని చెప్పారు. ఇక్కడి విజేతలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా సంస్థలు ఎంపిక చేసిన విషయం ముఖ్యమంత్రి ప్రకటించడంతో యువతలో ఉత్సాహం ఉరకలెత్తింది.

కిటకిటలాడిన స్టేడియం

ఆడుదాం ఆంధ్రా ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌కు వేలాది మంది యువత హాజరై మ్యాచ్ తిలకించారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్ మ్యాచ్‌కు వచ్చినట్లుగా విశాఖ నగర యువతతో పాటు సమీప జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినప్పటి నుంచి యువత కేరింతలు, ఈలలతో స్టేడియం మార్మోగింది. ముఖ్యమంత్రి దాదాపు అరగంట పాటు ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు.

హోరెత్తిన మైదానం

ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకలతో వైఎస్సార్ స్టేడియం హోరెత్తింది. ఒక పక్క చిన్నారుల నృత్యాలు.. మరో వైపు లేజర్ షో, ఫ్లాష్‌లైట్లతో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. తొలుత స్టేడియంలో దుబాయ్ జట్టు ఫ్లాష్ డ్యాన్స్ చక్ దే ఇండియా అంటూ అలరించగా కూచిపూడి నృత్యకారిణులు ఓం నమఃశివాయ అంటూ చేసిన ప్రదర్శన అలరించింది. క్రీడాకారులు జయహో అంటూ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మూడు కళా రూపాలతో 'ఆడుదాం ఆంధ్రా' థీమ్ సాంగ్‌కు చేసిన నృత్యం అబ్బురపరిచింది. ఒక్కసారిగా స్టేడియంలో లైట్స్‌ఆఫ్ అయ్యాయి. అంతే డ్రోన్స్ ప్రత్యక్షమయ్యాయి. అనంతరం వియ్ ఆర్ రాకింగ్ అంటూ ఫ్లాష్ ఫోతో స్టేడియం మిరమిట్లు గొలిపే కాంతులీనింది. స్టేడియం మొత్తం లైట్లతో లయబద్ధంగా నాట్యమాడింది. రెండు నిమిషాలపాటు బాణసంచాతో స్టేడియం దద్దరిల్లింది.



పటిష్ట బందోబస్తు

క్రీడోత్సవాలకు భారీగా క్రీడాకారులు, జనం తరలివచ్చినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. స్థానిక సీఐ వై.రామకృష్ణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కారు షెడ్ కూడలిలో ట్రాఫిక్ సమస్యలు నివారించడానికి సిబ్బందికి విధులు అప్పగించారు. పీఎంపాలెం-కొమ్మాది-వుడా రోడ్డు -చంద్రంపాలెంకు వెళ్లే వాహనాలను క్రమబద్ధీకరించారు.



స్టేడియంలో క్రికెట్ ఫైనల్ పోరు

వేడుకల్లో పాల్గొన్న వారు వీరే..

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజనీ, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, కంబాల జోగులు, నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు,గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



స్టేడియంలో ఉత్సాహంగా అభిమానులు

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: ఆడుదాం ఆంధాధ్రా రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నమెంట్ ముగింపు వేడుకలకు విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు విమానంలో ఇక్కడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు సీఎంకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 5.27 గంటలకు విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.35 గంటలకు మధురవాడ ఐటీ హిల్ నెం.3 వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు.





ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరి వెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున

హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు

హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎంకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు

'ఆడుదాం - ఆంధ్రా' రాష్ట్ర స్థాయి క్రీడా వేడుకలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రోడ్డు మార్గం ద్వారా విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 8.35 గంటలకు విజయవాడకు బయలుదేరారు. జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆయనకు వీడ్కోలు పలికారు.

ఉత్తరాంధ్ర తిరుమలగా పెందుర్తి వెంకటాద్రి

- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ
- వెంకటాద్రిపై పుష్కరిణి పనులకు శ్రీకారం

పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుమలగా పెందుర్తి వెంకటాద్రిని పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. వెంకటాద్రిపై వేంకటేశ్వరస్వామి భక్తులకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పెందుర్తి వెంకటాద్రిపై రూ.కోటి జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న పుష్కరిణి పనులకు మంగళవారం మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి నడుం బిగించారన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధికి రూ.1500 కోట్లు వెచ్చించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఒక ఆలయం ఉండాలన్న సంకల్పంతో తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల చొప్పున రూ.360 కోట్లు కేటాయించి 3,600 దేవాలయాల నిర్మాణం జరుగుతుందన్నారు. దాదాపు 10 వేల ఆలయాల్లో దూపదీప నైవేధ్యాల ఖర్చుల నిమిత్తం ప్రత్యేక నిధులు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని చెప్పారు. ముందుగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వెంకటాద్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.ఎస్.రాజు, ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



పుష్కరిణి పనులకు శ్రీకారం చుడుతున్న మంత్రి సత్యనారాయణ

నగరంలో ఏసీపీల బదిలీ

అల్లిపురం: రాష్ట్ర వ్యాప్తంగా ఏసీపీలను బదిలీ చేస్తూ ఏపీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.జి.వి.ప్రసాదరావును ఏసీబీ ఏసీపీగా బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దిశ పోలీస్ స్టేషన్ విజయనగరం ఏసీపీ ఎస్.వాసుదేవ్‌ను విశాఖ సిటీ ట్రాఫిక్-1 ఏసీపీగా నియమించారు. తూర్పు గోదావరి జిల్లా ఏసీబీ, ఎస్సీ ఎస్టీ సెల్-1 ఏసీపీ సీహెచ్.శ్యామలరావును విశాఖ నగర క్రైం ఏసీపీగా బదిలీ చేశారు. విశాఖ క్రైం ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బి.సునీల్‌ను నార్త్ క్రైం ఏసీపీగా బదిలీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ, అటాచ్డ్ నార్త్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.మురళీకృష్ణను నూజివీడు ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసరావును తూర్పు గోదావరి జిల్లా ఏసీబీ అండ్ అటాచ్డ్ ఎస్సీ ఎస్టీ సెల్ ఏసీపీగా బదిలీ చేశారు. నూజివీడు ఎస్‌డీపీవో ఏసీపీ ఎం.శ్రీనివాసరావును విశాఖ సిటీ స్పెషల్ బ్రాంచి ఏసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా



కబడ్డీ ఫైనల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

ఏయూ క్యాంపస్: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతోనే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. మంగళవారం ఏయూ క్రీడా మైదానంలో జరుగుతున్న కబడ్డీ ఫైనల్స్‌ను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దాదాపు రూ.120 కోట్లు వెచ్చించి అన్ని క్రీడాంశాలతో మెగా స్పోర్ట్స్ ఈవెంట్ నిర్వహించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. క్రీడలకు ఇది ఒక స్వర్ణయుగంగా చెప్పొచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు దశల్లో 3 లక్షలకు పైగా మ్యాచ్‌లు నిర్వహించామన్నారు. విజేతలకు భారీ నగదు బహుమతులు సైతం అందిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు గ్రూప్-1 ఉద్యోగాలు, అకాడమీల ఏర్పాటుకు భూములు, నిధులు కేటాయించామన్నారు. ప్రతి జిల్లాలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసి క్రీడాకారులకు శాప్ సహకారంతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఆడుదాం ఆంధ్రలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పెద్ద ఫ్రాంచైజీలతో అనుసంధానం చేసి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి, విదేశీ విద్యదీవెన వరకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను యువతకు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం బాపట్ల, తిరుపతి జిల్లాల మధ్య జరిగిన కబడ్డీ ఫైనల్స్‌ను మంత్రి రోజా తిలకించారు. 2024 జగనన్న వన్స్‌మోర్, చెట్టు మీద కొంగ చంద్రబాబు దొంగ అంటూ కూత పెడుతూ ఆమె సరదాగా కబడ్డీ కూడా ఆడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ క్రియేటివ్ హెడ్ ఎల్.జోగినాయుడు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోగా శ్రీనివాసులురెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో శ్రీనివాసులురెడ్డి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు కనకమహాలక్ష్మి దేవాలయ కార్యనిర్వహణాధికారిగా, ఉప కమిషనర్ పి.శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా అమ్మవారికి ఆయన విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సహాయ ఇంజినీరు కేఎస్ఎస్ మూర్తి, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైల్‌లో రాష్ట్ర స్థాయి పునశ్చరణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ హరీష్ కుమార్ గుప్తా

అరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో మంగళవారం రాష్ట్ర స్థాయి పునశ్చరణ తరగతులు (రిట్రీట్)–2024 ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ స్టేట్ లెవెల్ రిట్రీట్–2024ను రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఐజీ ఇండ్ల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఇది రెండు విడతలుగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న రెండో విడత తరగతులు జరగనున్నాయి. ఈ సందర్భంగా మొదటి విడత కార్యక్రమంలో డీజీ జైళ్ల శాఖకు సంబంధించిన నాలుగు రకాల సోషల్ మీడియా అకౌంట్స్ అయిన యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలను విడుదల చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెషన్‌లో భాగంగా ఏయూ ఆచార్యుడు (సోషయాలజీ విభాగం) శ్రీమన్నారాయణ మూర్తి సోషయాలజీ యాస్పెక్ట్స్ ఆఫ్ సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ గురించి వివరించారు. అనంతరం మరో సెషన్‌లో గుంటూరు రేంజ్ డీఐజీ ఎం.వరప్రసాద్, కోస్తాంధ్రా రేంజ్ డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్ ప్రత్యేక ప్రెజెంటేషన్ చేశారు. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి జైళ్లను ఏవిధంగా అభివృద్ధి చేయాలి, ఫైనాన్సియల్ ప్లానింగ్ ఆఫ్ ప్రిజన్ స్టాఫ్, భవిష్యత్‌లో జైళ్లు ఏవిధంగా ఉండాలి అనేదానిపై ప్రణాళిక తదితర అంశాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా డీజీ హరీష్‌కుమార్ గుప్తా అధికారులతో కలసి 2024 సంవత్సరానికి సంబంధించిన జైళ్ల శాఖ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్ల అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణ గురించి దిశానిర్దేశం చేశారు. అందరూ జైళ్ల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ జైల్ సూపరింటిండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర రావు, రాష్ట్రంలో పలు జైళ్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సెషన్స్‌లో పాల్గొన్న వివిధ జైళ్ల అధికారులు

మురిసిన క్రీడాలోకం

ఆడుదాం ఆంధ్రాపై క్రీడాకారుల ఆనందం



విజయోత్సాహంలో క్రీడాకారిణులు

మధురవాడ: ఆడుదాం ఆంధ్రా పోటీలతో క్రీడాలోకం మురిసిపోయింది. ప్రతిభ ఉండి ప్రోత్సాహం లేక..సరైన వేదిక లభించక నిస్తేజంలో ఉన్న మట్టిలో మాణిక్యాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. భుజంతట్టి ప్రోత్సహించింది. ఆడుదాం ఆంధ్రా వంటి మహాయజ్ఞం చేపట్టింది. రండి ఆడండి..ప్రతిభ చాటుకోండి..జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగండి అని పిలుపునిచ్చింది. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గెలుపొందిన వారికి ఊహించని విధంగా నగదు బహుమతులతో ఉత్సాహపరిచింది. దీంతో ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్రీడాలోకం జేజేలు పలికింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ మనోగతం ఇలా వెల్లడించారు.

ప్రతిభ చాటుకునే అవకాశం



పెళ్లైన అయిన తర్వాత కూడా ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. స్కూల్ టైంలో టెన్నీ కాయిట్, బాల్ బ్యాడ్మింటన్ నేషనల్స్‌లో ఆడాను. పెళ్లి తర్వాత అవన్నీ ఒదిలేశాను. ఆడుదాం ఆంధ్రా పోటీలు నాలాంటి వారికి ఎంతో ఉత్తేజాన్ని, ఆనందాన్ని ఇచ్చాయి. నా టాలెంట్ మళ్లీ ప్రూవ్ చేసుకున్నాను. స్టేట్ లెవెల్‌లో క్రికెట్‌లో 3వ బహుమతి గెలుకున్నాము. మహిళలు అందరి తరపున జగనన్నకు కృతజ్ఞతలు.

–బుడగుంట్ల స్వప్న, క్రికెట్ క్రీడాకారిణి, ప్రకాశం జిల్లా

ప్రతి ఏటా నిర్వహించాలి



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ఆటలు పోటీలు పెట్టడం చాలా మంచి ఆలోచన. విద్యార్థులేకాదు.... అన్ని వయస్సుల వారికి పోటీలు పెట్టి వారి ప్రతిభ చాటుకోవడానికి పోటీలు ఎంతగానో దోహదపడ్డాయి. పోటీలు ప్రతి ఏడాది నిర్వహించాలి.

–జి. శ్రీనివాసరావు, ఎంవీపీ సిటీ, మధురవాడ

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



క్రీడలంటే అందరికీ ఇష్టమే. ప్రతిభ చాటుకోవడానికి మంచి వేదిక కూడా ఉండాలి. ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు గొప్ప వరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు క్రీడాకారులు రుణపడి ఉంటాం.

–బి. సాయిలక్ష్మి, గోకుల్‌నగర్, మత్రిపాలెం.

విశాఖలో పండగ వాతావరణం



ఈ పోటీలు పిల్లలకే కాదు.. అన్ని వయస్సుల వారికి ఉపయోగంగా ఉన్నాయి. ఆటలు గురించి మరచిపోయిన వారితో కూడా మన సీఎం ప్రతిభ చాటుకునే అవకాశం కల్పించారు. ఇది చాలా మంచి ఆలోచన. పైగా మన వైజాగ్‌లో ఈ ముగింపు పండగ జరగడం చాలా సంతోషంగా ఉంది. – ఎం. రఘాన్సీ, గృహిణి, అక్కిరెడ్డిపాలెం.

ఇంతలా ప్రోత్సహించిన సీఎంను చూడలేదు



ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడాకారులను ఏ ముఖ్యమంత్రి ఇంతలా ప్రోత్సహించలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులకు అండగా నిలిచి ప్రోత్సహించారు. పోటీలు నిర్వహించడమే కాదు..ఏ లోటూ లేకుండా చూసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, టైట్ పాలెం గ్రామ సచివాలయం నుంచి క్రికెట్ ఆడేందుకు వచ్చాం. 3వ స్థానంలో నిలిచాం.

–మహబూబ్ షరీఫ్, క్రికెట్ క్రీడాకారుడు

చాలా సంతోషంగా ఉన్నాం



గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి వారికి పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుకుంటానని కలలో కూడా ఊహించుకోలేదు. పైగా ప్రైజ్ మనీ కూడా భారీగా ఇస్తున్నారు. క్రీడాకారులంతా చాలా సంతోషంగా ఉన్నాం.

–ఎస్. సంతోష్‌కుమార్, విజయవాడ

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఆడుదాం ఆంధ్రాలో మేమూ భాగస్వాములవడం చాలా ఆనందంగా ఉంది.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. చాలా దూరం నుంచి క్రీడాకారులను కంటికి రెప్పలా చూసుకున్నారు. ఇంత మంది క్రీడాకారులకు ఎక్కడా లోటు రాకుండా చూసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి వచ్చింది.

–కట్ట హేమలత, క్రికెట్ క్రీడాకారిణి, ప్రకాశం జిల్లా

ఏర్పాట్లు అద్భుతం



ఏర్పాట్లు ఎక్కడా ఏవిధమైన లోటు లేదు. భోజనం, వసతి అద్భుతంగా ఏర్పాటు చేశారు. సచివాలయ స్థాయి నుంచి పోటీలు పెట్టినప్పుడు, నాన్ మెడలిస్టలకే పోటీలు పెట్టి ఉంటే బాగుండేది. మరింత ప్రయోజనం ఉండేది. మేము బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కడప జిల్లా నుంచి వచ్చాం. ప్రైజ్ కూడా గెలుచుకున్నాం.

–వెన్నెలశ్రీ, జి. శ్రీలత

సీఎం ప్రతి ఆలోచనా గొప్పదే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసే ప్రతి ఆలోచనా చాలా విలువైనది. ఆడుదాం ఆంధ్రానే కాదు.. అమ్మ ఒడి, నాడు–నేడు ఏ ఆలోచన చేసిన అది ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది. పైగా దాని వలన చక్కని ఫలితాలు వస్తున్నాయి. ప్రజలకు కూడా మేలు జరుగుతుంది. అలాంటి మరో గొప్ప ఆలోచన ఆడుదాం ఆంధ్రా పోటీలు.

–బూస.అప్పలరాజు, బొడ్డపాలెం, ఆనందపురం మండలం.

జేఈఈ మెయిన్స్‌లో 'గురుకులం' సత్తా





సిగ్గె తేజస్వి కొట్టికి దీపిక దీక్షిత



సువార్త

మధురవాడ: జేఈఈ మెయిన్స్‌లో మధురవాడ సమీపంలోని మారికవలస గిరిజన గురుకుల బాలికల ప్రతిభా కళాశాలకు చెందిన బాలికలు ప్రతిభ కనబరిచారు. జనవరిలో నిర్వహించిన పరీక్షలకు 24మంది హాజరు కాగా 17మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. చింతపల్లి మండలం భీమసింగి గ్రామానికి చెందిన రమణ కుమార్తె సిగ్గె తేజస్వి 89.24 పర్సంటైల్, చింతపల్లి మండలం పనసలపాడు గ్రామానికి చెందిన రాధాకృష్ణ కుమార్తె కొట్టికి దీపిక 86.42 పర్సంటైల్, పెదబయలు మండలం లక్కేపుట్టు గ్రామానికి చెందిన రాజారావు కుమార్తె పాంగి దీక్షిత 77.32 పర్సంటైల్, డుంబ్రిగుడ మండలం తుమ్మిడ్రుగుడ గ్రామానికి చెందిన సుభదాస్ కుమార్తె బిడ్డిక సువార్త 69.94 పర్సంటైల్ సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె. విశ్వనాధం, ఉపాధ్యాయులు అభినందించారు.

శశి విద్యార్థుల ప్రతిభ





ఎస్.దిలీప్ వెంకట సతీష్ జె.వెంకట హర్షవర్ధన్ నాగసాయి నారాయణ



ఎస్.అనిల్‌వర్మ

తగరపువలస: ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎస్.దిలీప్ వెంకట సతీష్ 99.94, జె.వెంకట హర్షవర్ధన్ 99.76, సిహెచ్ నాగసాయి నారాయణ 99.74, ఎస్.అనిల్‌వర్మ 99.61, జి.దుర్గాప్రసాద్ 99.46, జి.జైదీప్, సీహెచ్ శ్యామ్ సుందర్ 99.43, పి.కుశ్వంత్‌సాయిరెడ్డి 99.26, జి.పృథ్వీతేజ 99.14 పర్సంటైల్ సాధించారన్నారు. 22 మంది విద్యార్థులు 98కు పైగా, 36 మంది 97కు పైగా, 45 మంది 96కు పైగా, 53 మంది 95కు పైగా, 105 మంది 90కు పైగా పర్సంటైల్ సాధించినట్టు తెలిపారు. వీరిని వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, అధ్యాపక బృందం అభినందించింది.

శ్రీ విశ్వ విద్యార్థుల విజయభేరి



ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో శ్రీవిశ్వ యాజమాన్యం

తాటిచెట్లపాలెం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కాలేజి విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించి, విజయకేతనం ఎగరవేశారని కాలేజీ యాజమాన్యం తెలిపింది. విశాఖపట్నం విద్యార్థులు జె.శ్రావ్య 99.80, పి.ఓంకార్ సాయి రాయుడు 99.76, జె. శ్రావ్యశ్రీ 99.76, ఎం.యశస్వి 99.64, డి.నవదుర్గ శ్రీ నితీష్ 99.36, ఆర్.హేమంత్ 99.28, జి.జ్యోతికిరణ్ 99.21, ఎం.కీర్తన 99.19, గుండాల వినయ్ 99.10 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. వీరితో పాటు 99 పర్సంటైల్‌కు పైగా 9మంది, 98 పర్సంటైల్‌కు పైగా 24మంది విద్యార్థులు ఫలితాలు సాధించినట్లు తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.

కాంగ్రెస్ అన్యాయం చేస్తే.. బీజేపీ ద్రోహం చేస్తోంది



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

డాబాగార్డెన్స్: రాష్ట్రాన్ని విభజించి కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేస్తే.. ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్రోహం.. దగా.. మోసం చేస్తోందని ప్రత్యేక హోదా సాధన సమితి ప్రతినిధులు చలసాని శ్రీనివాస్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు ముగిసిన అధ్యాయాలు కావన్నారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్లు ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రతిపాదించగా, ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ పదేళ్లు ఇవ్వాలని ప్రతిపాదించిందని గుర్తు చేశారు. అయితే విభజన చట్టంలో ప్రత్యేక హోదా గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. స్వలాభం కోసం బీజేపీతో పలు పార్టీలు పొత్తుకు వెంపర్లాడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం లేదని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని బీజేపీ ప్రభుత్వం కుంటిసాకులు చెబుతోందన్నారు. వాస్తవానికి అలా ఎక్కడా చెప్పలేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం లేనప్పుడు.. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పాండిచ్చేరిలో ఎన్నికల సందర్భంగా ప్రత్యేక హోదా ఇస్తామని ఎలా ప్రకటించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు జగ్గునాయుడు, మరుపిళ్ల పైడిరాజు, ప్రొఫెసర్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నేపథ్యంలో విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి కాకుండా మిగతా రైళ్లు యథావిధిగా నడవనున్నాయని పేర్కొన్నారు.

రద్దయిన రైళ్లు

- ఈ నెల 26 నుంచి మార్చి 31వ తేదీ వరకు మచిలీపట్నం–విశాఖపట్నం(17219) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు విశాఖపట్నం–మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 26 నుంచి మార్చి 31 వరకు గుంటూరు–విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 26 నుంచి మార్చి 31వ తేదీ వరకు కాకినాడ–విశాఖపట్నం–కాకినాడ (17267/17268) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 26 నుంచి మార్చి 31వ తేదీ వరకు గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు రాయగడ–గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్

దారి మళ్లించిన రైళ్లు

నిడదవోలు–ఏలూరు–విజయవాడ మీదుగా కాకుండా పలు రైళ్లు వయా నిడదవోలు–భీమవరంటౌన్– గుడివాడ–విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

- ఈ నెల 26, మార్చి 4, 11, 18, 25వ తేదీల్లో ఎర్నాకుళం–పాట్నా(22643) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 28, మార్చి 1, 6, 8, 13, 15, 20, 22, 27, 29వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు–గౌహతి(12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 26, 28, మార్చి 1, 2, 4, 6, 8, 9, 11, 13, 15, 16, 18, 20, 22, 23, 25, 27, 29, 30వ తేదీల్లో ముంబయి–భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 26 నుంచి మార్చి 31 వరకు ధన్‌బాద్–అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 29, మార్చి 7, 14, 21, 28వ తేదీల్లో టాటానగర్–యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 28, మార్చి 6, 13, 20, 27వ తేదీల్లో జసిద్ది–తాంబరం(12376) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 26, మార్చి 4, 11, 18, 25వ తేదీల్లో హతియా–ఎర్నాకుళం(22837) ఏసీ ఎక్స్‌ప్రెస్
- మార్చి 2, 9, 16, 23, 30వ తేదీల్లో హతియా–ఎస్ఎంవీ బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 27, మార్చి 3, 5, 10, 12, 17, 19, 24, 31వ తేదీల్లో హతియా–ఎస్ఎంవీ బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్
- మార్చి 1, 8, 15, 22, 29వ తేదీల్లో టాటానగర్–ఎస్ఎంవీ బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆయా తేదీల్లో మళ్లించిన మార్గంలో నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు.